# బిరుదులు బిగిస్తాం

–లక్ష్మీ భారతిరెడ్డి

'ఆకాశానికి జలుబు చేసింది
అందుకే భూదేవి స్నానం చేసింది
ఎండిపోతున్న మొక్క ఎదగసాగింది
చిగురులెయ్యాలని చిందులేసింది'

లోకల్ పత్రికలో అచ్చయిన ఈ కవితను ఇప్పటికి కవి ఏ ఇరవై ముప్పైసార్లో చదివాడు. అయినా మళ్ళీ మళ్ళీ చదువుకుంటూనే ఉన్నాడు. తన భుజాన్ని తనే తట్టుకుంటూ 'శెభాష్' అనుకుంటున్నాడు.

అలా చదువుల పరంపర కొనసాగుతుండగా ఆ కవితక్రిందే ఉన్న ప్రకటన కంటపడింది.

''బిరుదులు బిగించబడును. వివరాలకు 3280091.''

ఆలస్యం అమృతం విషం అనుకున్నాడేమో! పక్కనున్న టెలిఫోన్ బూత్ వద్దకు పరుగెత్తుకెళ్ళి ఆ నెంబర్ డయల్ చేశాడు.

రింగవూతూంది.

''హల్లో'' ఎవరో ఫోన్ లిఫ్టు చేశారు.

''హలో 3280091నాండి''

''అవునండి. ఇంతకూ మీరెవరు?''

''నా పేరు కవండి. అంటే పూర్తిపేరు కలం వియ్యన్న. ఇంతకూ 'ఉత్తుత్తి' లోకల్ పత్రికలో 'బిరుదులు బిగించబడును' అని ప్రకటనిచ్చింది మీరేనా?''

''ఆ...ఆ...మేమే''

''అదేంటండీ అలాగిచ్చారు. అవేమైనా కుళాయి పైపులా బిగించటాన్కి''

''వెరైటీగా ఉంటుందని, అందుకేగా మీరు ఫోన్ చేశారు!''

''మీతో మాట్లాడాలండి''

''అలాగే. రండి అడ్రసు చెబుతాను రాసుకోండి''

''ఆ.....చెప్పండి''

''అదేపని, రైల్వేస్టేషన్ ఎదురుగా, అప్పారావు బిల్డింగ్''

వాళ్ళకి థాంక్స్ చెప్పి మరో గంటలో వస్తానని చెప్పి ఫోన్ పెట్టేశాడు కవి.

కవి తను కవనుకుంటాడు. డబ్బున్న వారి దయాధర్మాల మీదే నడిచే లోకల్ పత్రికల్లో తను రాసిన కవిత్వాల్ని, (అవి కవిత్వాలని అతని భ్రమపాపం), డబ్బిచ్చి మరీ వేయించుకుంటుంటాడు. బస్సున్నాక డ్రైవరూ, కవన్నాక బిరుదులూ ఉండాలి కదా మరి!

అందుకే తనకూ హీన పక్షం ఒకట్రెండు బిరుదులు అవసరమని భావించాడు. సరిగ్గా అలాంటి సమయంలోనే 'అదేపని' బిరుదులు బిగించేవారి చిరునామా దొరికింది.

వెంటనే ఆ అడ్రస్ పట్టుకుని ఆ ఆఫీస్‌కు వెళ్ళాడు.

★★★

''మీ పేరు చెప్పారు కాదు'' కాఫీ తాగుతూ తనెదురుగా ఉన్న వ్యక్తిని ప్రశ్నించాడు కవి.

''నా పేరు పైసల్. మా బిరుదుల కంపెనీ పేరు మీకిదివరకే చెప్పాను 'అదేపనని' '' సిగరెట్ దమ్ములాగుతూ చెప్పాడు పైసల్.

''మంచిది లక్ష్యానికి, పనికి పేరు. ఇంతకూ ఏమాత్రం ఖర్చవుతుందంటారు?'' అడిగాడు కవి ఉత్సాహంగా.

''మీరు ముందు బిరుదులు వినండి. రేటు సంగతి తర్వాత. ప్రస్తుతానికి మా దగ్గర ఉన్న బిరుదులివి. 'కొండవీటి సింహం, బొబ్బిలిపులి, కులదైవం, జాతిరత్నం, ఉద్దండపిండం, మట్టిలోమాణిక్యం, వజ్రం, పగడం, చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు' అంటూ చదవటం పూర్తిచేసి కవికేసి చూశాడు పైసల్.

''పేర్లు బానే ఉన్నాయి. కానీ ఇందులో దాదాపుగా అన్నీ సినిమాపేర్లు, మాసపత్రికల పేర్లున్నాయేటి? ఇవి తగిలించుకుంటే తన్నరూ?'' సందేహం వెలిబుచ్చాడు కవి.

''ఆ పేర్లదేముంది లెండి, బిరుదు ప్రదానం గాని. పోయిన నెలలో రౌడీ రంగన్నకు 'దీన జన బంధు, దీపారాధన' బిరుదులిస్తే ఎవరేం అన్నారని?''

''అంతేనంటారా? అయితే ఖర్చేమాత్రం అవుతుందంటారు?''

''ముందు మీరిది తేల్చండి ఖర్చు సంగతి తర్వాత చెప్తాను. సభకు వందమంది సరిపోతారా? ఇంకా ఎక్కువ కావాలా?''

''అంటే జనాన్ని బట్టి రేటా?''

''మరే! బిరుదులయితే మాదగ్గరున్నాయి కాని, జనాన్ని బయటి నుండి తోలుకురావద్దూ? గంట సభకు మనిషికి ఇరవై రూపాయలు''

''అయితే యాభై మంది చాల్లెండి'' నీళ్ళు మింగుతూ జవాబిచ్చాడు కవి.

''బిరుదుకు రెండువేలు. ఒకటికన్నా ఎక్కువ బిరుదులు కొనుక్కుంటే పదిశాతం డిస్కౌంటు కూడా ఇస్తాం. నామాట విని ఈ బొబ్బిలిపులి, కొండవీటిసింహం తీసుకోండి డిస్కౌంట్ పోనూ మూడువేలా ఆరువందలకొస్తాయి''

''అద్సరే. ఈ రెండు బిరుదులూ నా మెడకేసేసరికి మొత్తం ఖర్చెంతవుతుందో ఒక్కమాటలో చెప్పండి.''

''బిరుదులు మూడువేలా ఆరువందలు, జనాభాఖర్చు వెయ్యి, పూలదండల ఖర్చు అయిదొందలు, చీఫ్‌గెస్టుల ఖర్చు వెయ్యి, మైకూ షామియానాల ఖర్చు ఆరొందలు, కాఫీ, టీ ల ఖర్చు రెండొందలు మొత్తం కలిపి, మరో అయిదొందలు ఈ బిరుదు వార్త కవర్ చేసినందుకు 'ఉత్తుత్తి' పత్రికకు ఇస్తే..'' గాలిలో చేతులు త్రిప్పుతూ లెక్కలు ముగించి చెప్పాడు పైసల్.

కవి ముఖంలో కాస్త కలవరపాటు కనిపించింది. ఆ కలవరపాటు వెనుక జన్మకోబిరుదైనా లేకపోతే జన్మెందుకు అన్న ఆరాటం కూడా ఉంది.

''పూలదండల ఖర్చు కూడా వేయడం మరీ

దారుణం.'' మనసులో మాట బైటపెట్టాడు కవి.

''మీ పిచ్చికాకపోతే కవిగారూ! ఆ దండలేవో మీకే వేస్తాంగాని మేమేసుకుంటామండీ విడ్డూరంగా'' నోట్లోని పళ్ళు బయటికి కన్పించేలా నవ్వుతూ అన్నాడు పైసల్.

''అంతేనంటారా?''


''మరే''

''అయితే ఒక్క షరతు'' కుర్చీలో సర్దుకుని కూర్చుంటూ అడిగాడు కవి. ఏమిటన్నట్టు చూస్తున్న పైసల్‌కేసి మళ్ళీ తనే

''ఆ ఏం లేదు. కొత్తదనం లేకపోతే ఏం బావుంటుంది. అందుకనే నా సన్మాన సత్కారాల సభ అచ్చతెలుగు స్థాయిలో జరగాలి''

అర్థం కానట్టు బుర్రగోక్కుంటూ మూతి అదోలా పెట్టాడు పైసల్.

కవి చెప్పుకుపోతున్నాడు.



''అర్థం కాలేదా? మామూలుగా సభ ప్రారంభానికి ముందు మైకు టెస్టింగ్ ఎలా చేస్తారు?'' చెప్పటం ఆపి పైసల్ సమాధానం కోసం ఆగాడు కవి.

''హలో..మైక్ టెస్టింగ్...వన్..టూ.. త్రీ.. ఫోర్..'' వివరించాడు పైసల్.

''కదా! మరి నా సభకు అలా కాదు. ఎవరక్కడ... ధ్వని ప్రసారణా పరీక్షనిమిత్తం... ఒకట్రెండు..మూడూ నాలుగు..ఇలా అంతా తెలుగులోనే జరగాలి. ప్రారంభం నుండి ముగింపుదాకా వెరైటీగా ఉండాలి.''

ఆ తర్వాత కొంత తర్జన భర్జనల తర్వాత ప్రోగ్రాంపై ఒక ప్రణాళికను ఇద్దరూ తయారుచేసి ఆమోదించారు.

డబ్బుమాత్రం ఇలా సభ ముగియటం, అలా చేతికి ఇవ్వటం అన్న ఆర్థిక ఒప్పందమూ జరిగిపోయింది.

మరుసటిరోజే బిరుదులు బిగించాలని తీర్మానించుకున్నారు.

★★★

''ఎవరక్కడ? ధ్వని ప్రసారణా పరీక్ష నిమిత్తం ఒకట్రెండు మూడు నాలుగు'' అంటూ ఒక బండ గొంతు మైకులో వినిపించింది. కట్టెల పొయ్యి రగలేసేప్పుడు వాడే ఊదరగొట్టం లాంటి 'ఉఫ్-ఉఫ్' మన్న శబ్దం.

సభ ప్రారంభం అయింది.

ముందుగా పైసల్ మైకు వద్దకొచ్చాడు.

''దీనజనులారా! ఈరోజు మనం ఇక్కడ ఎందుకు పోగయ్యామో మీ అందరికీ తెలుసు. మన కవి, కవిగారిని సన్మానించడం అంటే అది ఎక్కడుందో తెలియని కళామతల్లిని సత్కరించడమే. మన కవిగార్ని గురించి ప్రముఖ వ్యక్తి, సమూహశక్తి అయినా ఏ శక్తీ లేకుండా ప్రస్తుతం ఉన్న కోతల్‌రావు గారు తన బాణీలో మాటలాడవలసిందిగా కోరుతున్నాను.'' అని మైకును కోతల్‌రావు ముందు పెట్టి అతని చెవిలో ''డబ్బు తీసుకున్నట్లుగాదు. నాలుగు మంచి మాటలు చెప్పు'' అని గొణిగి కూర్చున్నాడు.

కాలరు సరిచేసుకుంటూ మైకు ముందు గొంతు విప్పాడు కోతల్‌రావు.

''ఇక్కడకు విచ్చేసిన మహాజన సందోహానికి మహావందనాలు''


''ఓరి నీయబ్బ ఇక్కడుంది 50 మందేరా కోతలూ మరీ అంతగా కోయకు'' కోతల్‌రావు తొడ గిల్లుతూ చిన్నగా అన్నాడు పైసల్.

''అబ్బా!'' అని తిరిగి సర్దుకుని ''నేనబ్బా అని ఎందుకన్నానో తెలుసా? అబ్బా! ఇంతమంచి కవికి సన్మానం చేయడం నా చేతుల మీదగా ఎంతదృష్టం అబ్బా! అని అర్థం. మరి వారి రచనల గురించి పరిశీలనల పాపయ్యగారు చెపుతారు'' ముగించాడు కోతల్‌రావు.

ఇపుడు పరిశీనల పాపయ్య వంతొచ్చింది.

''నమస్కారం..నమస్కారం..కవిగార్ని గురించి, ఆయన కవితల గురించి చెప్పాలంటే ముందుగా ఆయన వ్రాసిన 'ఉడుముకొచ్చిన కడుపు' కవిత గురించి చెప్పుకోవాలి. ఆ కవితలో కడుపొచ్చిన ఒక ఉడుమును ఎలా వర్ణించిందీ మాటల్లో చెప్పలేను. మీరు చదవాల్సిందే.

అలాగే ఆయన కలం కక్కిన జల్లు నుంచి కారిన 'కోతికి సీమంతం' అన్న కవితను గురించి చెప్పాలంటే భాష చాలదు. ఓపిగ్గా చదవాల్సిందే. ఈ సందర్భంగా ఆయన విరిచి తునాతునకలు చేసిన 'కిళ్ళీ పెళ్ళి' కవితను చెపుతాను.



'ఆకుతో వక్కదోస్తీ
సున్నంతో లవంగాల కుస్తీ
పళ్ళతో నాలుక రంగులపోటీ
ఊస్తే నేలకు రంగవల్లుల మాటీ''

''వ్వా..వ్వా..ఏం భాషా చతురత. అర్థాలు అడుక్కుతినే పరిపక్వత. మరి ఇంతటితో నేను ముగిస్తూ ఇక మిగతా కార్యక్రమాన్ని జరిపించవలసిందిగా ఈ సన్మాన సభ అధ్యక్షులు రౌడీ రంగన్న గార్ని కోరుతూ విరమిస్తున్నాను'' అని తన ప్రసంగాన్ని ముగించి కూర్చున్నాడు కోతల్‌రావు వంక గర్వంగా చూస్తూ పరిశీలనల పాపయ్య. వెంటనే రౌడీ రంగన్న తన సహజ ఫోజుతో పైకి లేచి ఒక ప్రశంసా పత్రాన్ని తీసుకుని.

''అందరికీ దండం. ఈయన కవంట. మీళ్ళు చెపితే తెలిసింది. నిజంగా చెప్పాలంటే ఈరోజు నాకు ఖాళీ లేదు. గాంధీ రోడ్డులో గొడవ చేయ టానికి ప్రోగ్రాం ఉంది. కానీ పైసల్‌ని కాదనలేదు. అందుకే వచ్చాను. ఈ కాగితంలో ఏం రాసుందో నాకు తెలీదు. ఈ కాగితాన్ని ఆ కవికిస్తాను. ఇందులో ఏముందో పైసల్ చెబుతాడు''

ఆ ప్రశంసాపత్రాన్ని కవికందించి మెడలో పూలదండ వేసి కూర్చున్నా డు రంగన్న. పత్రాన్ని మళ్ళీ పైసల్ తీసుకుని.

''యాభైమంది యువజనులా రా! ఈరోజు కవిగారికి 'కొండవీటి సింహం, బొబ్బిలిపులి' అన్న బిరుదు లను బిగిస్తున్నాము. ఇకముందు నుండి ఆయన తన పేరుముందైనా, వెనకైనా ఈ బిరుదులు బిగించుకో వచ్చు'' అని ముగించాడు. సభ ముగిసింది.

అందరూ వెళ్ళిపోయారు.

''ఇదన్యాయం, అక్రమం, అవమా నుషం, అడవినీతి'' గగ్గోలు పెడుతు న్నాడు కవి. అర్థంకాక ఏమైందన్నాడు పైసల్.

''పూలదండల ఖర్చు వెయ్యి గుంజుతూ ఒక్క దండేవేస్తారా? ఇదన్యాయం కాదంటారా? గంటసేపు సభ జరిగితే ఒక్కడైనా తెచ్చుకున్న యాభైమందిలో చప్పట్లు కొట్టారా? కాఫీలు, టీల ఖర్చు క్రింద రెండొందలు నా ముక్కుపిండి వసూలు చేసి కనీసం మంచినీళ్ళ గ్లాసయినా ఇచ్చారా? ఇంతకన్నా అన్యాయమా?'' లబోదిబో రామచంద్రా అంటున్నాడు.

''అరవకయ్యా! ఆయాసం వస్తుంది. ఏంటి నీ గొడవ? ఆ..! యాభైమందిని తెస్తామన్నాం తెచ్చాం. కానీ, వాళ్ళ చేత చప్పట్లు కొట్టిస్తామని చెప్పానా? నిన్న లారీల స్ట్రైకు వల్ల నగరంలో పూలు దొరకలేదు. ఆ ఒక్కదండకే నానా తంటాలు పడ్డాం. ఆ విషయం లారీల వాళ్ళ నడుగు. ఇక కాఫీ, టీల మాటలంటారా! అదో కప్పు, ఇదో కప్పు ఇప్పుడిస్తాం తాగండి. తాగే ముందు డబ్బు కక్కండి'' గడగడా అనేసి ఊపిరి పీల్చుకున్నాడు పైసల్.

''నేను డబ్బు ఇవ్వను'' ఖరాఖండిగా చెప్పాడు కవి.

''మాకు తెలుసండి. ఇలాంటి ఉద్ధర గాళ్ళుం టారని ఊహించే రౌడీరంగన్న గార్ని ముందుగానే ఏర్పాటు చేసుకున్నాం'' అంటూ రంగన్నకు సైగ చేయబోయాడు పైసల్.

కవికి వణుకు పుట్టడం ప్రారంభమైంది.

దెబ్బలు తిని డబ్బివ్వడంకంటే ఇచ్చి తప్పించుకో వడం మంచిదనే నిర్ణయానికి అరక్షణంలోనే వచ్చేశాడు.

మీదికి రాబోతున్న రంగన్నను ఏడుపుముఖంతో వారిస్తూ జేబులోంచి డబ్బుతీసి పైసల్ చేతిలో పెట్టి నమస్కారం చేశాడు.

★★★

వారం రోజులు గడిచాయి.

ఒకరోజు రిజిస్టర్ పోస్ట్‌లో వచ్చిన ఉత్తరాన్ని సంతకం చేసి పోస్ట్‌మేన్ నుండి తీసుకుని చదివి కుప్పకూలాడు కవి.

ఇంతకూ ఆ ఉత్తరంలోని సారాంశం ఏంటంటే!

వారం రోజుల క్రితం తను బోలెడు డబ్బుపోసి తగిలించుకున్న 'కొండవీటి సింహం, బొబ్బిలిపులి' బిరుదులు ఆ 'అదేపని' వారు నెలక్రితమే ఇంకో ఇలాంటి కవికి అమ్మేశారట. మీకన్నా ముందు నేను కొనుక్కున్న బిరుదులు మళ్ళీ మీరు అదే సంస్థ ద్వారా కొనుక్కున్నందుకు కోర్టుకెక్కుతున్నట్టు వచ్చిన బాంబు ఉత్తరం అది.

హడావుడిగా పెన్నూ, కాగితం తీసుకుని ఆవేశంగా ఇలా రాసుకున్నాడో కవిత కవి.

''బుద్ధిలేక బిగించుకున్నాను బిరుదులు
బిగుసుకున్నాయి నా మెడకు నోటీసులు
'అదేపని' చేసింది ఇంత పని
కట్టేస్తున్నాను కలాన్ని ఇంతటితో సరని!''

★

## అబ్బాస్ ఆల్బమ్!



యువతరంలో తనదైన క్రేజ్ సంపాదించుకున్న హీరో అబ్బాస్! అయితే 'ప్రేమదేశం' తర్వాత అబ్బాస్‌కి ఒక్కటంటే ఒక్కటైనా సరైన హిట్టు లేకపోవడం అందరికన్నా అతనికే ఎక్కువ నిరాశను కలిగించే విషయం. అందుకనే కాస్త రిలీఫ్ కోసం అన్నట్టు అబ్బాస్ ఈమధ్య ఓ ప్రైవేట్ ఆల్బమ్‌లో కొన్ని పాటల్లో నటించాడు. ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ రాజశ్రీ ప్రొడక్షన్స్ వారు రూపొందించిన ఓ వీడియో ఆల్బమ్‌లో అబ్బాస్ హీరోగా నటించాడు. సూరజ్ బర్జాత్యా తమ్ముడు రజత్ బర్జాత్యా రూపొందించిన ఈ ఆల్బమ్ అయినా అబ్బాస్ దశ మారుస్తుందేమో! ఈ లెక్కన అబ్బాస్ రాజశ్రీ సంస్థ వారిని మరిపిస్తే వారు తీయబోయే చిత్రాల్లోగాని చాన్స్ ఇస్తే ఇక చెప్పేదేముంది? లక్కే లక్!

-జె.ఎం.